నూతన పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - రావికమతం: మండలంలోని కవ్వగుంట గ్రామంలో నూతనంగా మంజూరైన 12 పెన్షన్లను సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. పాత పెన్షన్‌దారులు 170 మంది కాగా కొత్తగా మరొక 12 మంది కలిపి మొత్తం 182 మందికి పెన్షన్లను అందించారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పకుండా హామీలను అమలు చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు ప్రగడ నాగేశ్వరరావు, బీర పద్మ, చంద్రన నాయుడు, రొబ్బావర కుమారి, స్కూల్ కమిటీ చైర్మన్ నాయుడు బాబు, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

పాడేరు: అర్హత ప్రామాణికంగా పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక చెక్కులను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్లో లబ్ధిదారులకు జేసీ శ్రీనివాసు, సబ్ కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. జిల్లాలోని 5,398 కొత్త పెన్షన్ మంజూరయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. వైయస్సార్ పెన్షన్ కానుక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు సరస్వతి, వైసీపీ సీనియర్ నాయకులు సుశీల పాల్గొన్నారు.

నర్సీపట్నం: కులమతాలకతీతంగా పార్టీలు చూడకుండా పెన్షన్ల పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసీపీయేనని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలానికి మంజూ రైన 151 పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయమాధవి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం, 502 సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్ లబ్ధిదారులకు రూ.2750లు చొప్పున పెన్షన్ మొత్తాన్ని మంగళవారం స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పేరూరి చినబాబు, రోమాల నూకరాజు, బొడ్డు నారాయణమూర్తి, అంగటి సూరిబాబు, జొన్నాడ సాయికృష్ణ, కృష్ణమూర్తి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ కుమారి కళ్యాణ మండపంలో పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు 91, 92 వార్డులలో నూతనంగా మంజూరైన పెన్షన్లను జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల పరిధిలో 178 మంది లబ్ధిదారులకు కొత్త పెన్షన్లను అందజేశామన్నారు. ఆడారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో ఇస్తున్న పెన్షన్లను ఉప్పాటి హిమ శైలజ, బర్ల జగదీశ్వరరావు, ఐకా లక్ష్మి, బండి పెద్దింటమ్మలకు అందజేశారు. అలాగే గతంలో టిడ్కో ఇళ్లకు డీడీలు కట్టి ఇల్లు రాని 135 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లు నాయుడు, ఏపీడీ శ్రీరామ్, 91, 92 వార్డుల అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ పాల్గొన్నారు.

మల్కాపురం: 58వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యులు, టౌన్ ప్లానింగ్ చైర్మన్ గులిగిందాల లావణ్య చేతుల మీదుగా 55 మందికి కొత్త పెన్షన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు వేణుగోపాల్ రెడ్డి, అప్పల రెడ్డి, సత్యవతి, అప్పలరాజు, చంద్రరావు, ప్రసాద్ రెడ్డి, సుబ్బలక్ష్మి, శ్రీనివాస్ రాజు, చుక్క వరలక్ష్మి, జగన్నాథం, బుజ్జి, బాబీ, వనమాడ అప్పలరాజు, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

స్మైల్ సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు అవగాహన

విశాలాంధ్ర - జి.మాడుగుల: స్మైల్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో జి.మాడుగుల మండలంలోని నిట్టమామిడి గ్రామంలో 30 మంది డ్వాక్రా గ్రూపు మహిళలకు అటవీ ఉత్పత్తులపై నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో మైక్రో ఎంటర్ ప్రైజ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం 10 రోజుల శిక్షణా కార్యక్రమం జరిగింది. నాబార్డ్ నుండి డి.జి.ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఋణ సదుపాయం మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా లభించడం ద్వారా తమ ఉత్పతులను మార్కెటింగ్ చేసుకుంటూ వ్యాపారవేత్తలుగా మారవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్మైల్ సంస్థ కోఆర్డినేటర్ రవి కుమార్, స్మైల్ రిసోర్సు పర్సన్స్ చిన్నమ్మి, బాలకృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - సీలేరు: ఆధార్ సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జీకేవీధి ఎంపీడీఓ ఉమామహేశ్వరావు కోరారు. సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో గల ప్రజలకు ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవడానికి మంగళవారం గ్రామ సచివాలయంలో ప్రారంభించామని ఆయన తెలిపారు. ఆధార్ అప్డేట్ ఆధార్ కొత్త కార్డులు నమోదు, మార్పులు చేర్పులు చేసుకోవడానికి మంచి అవకాశమని పేర్కొన్నారు. కావున ఆధార్ అవకాశం అని ప్రతి ఒక్కరూ ఆధార్ సేవలను సద్వినియం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలకృష్ణ చొరవతో ఆధార్ సెంటర్‌ని ఏర్పాటు చేయడం జరిగిందని, వారం రోజులు పాటు సీలేరు ఆధార్ సెంటర్‌ని కొనసాగిస్తామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గీతం ఎన్ఎస్ఎస్ వన సంరక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్థానిక జూ పరిసరాలలో వన సంరక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో 45 మంది వాలంటీర్లు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వన సంరక్షణ ప్రాధాన్యతను ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ప్రకృతి సమతుల్యతకు, కాలుష్య నివారణకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అవసరమని తెలిపారు.

గొన్న కళాశాలలో క్యాంపస్ సెలక్షన్

విశాలాంధ్ర - పరవాడ: గొన్న కళాశాలలో మంగళవారం బిగ్ బాస్కెట్ ఫూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ఇంటర్వ్యూలలో 100 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 10 మందిని కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ గొన్న హేమ చంద్ నాయుడు క్యాంపస్ డ్రైవ్ గురించి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొన్న కళాశాల విద్యార్థులందరికీ మెరుగైన స్థాయిలో ఉద్యోగాలు వచ్చేలా యాజమాన్యం ప్రయత్నిస్తుందని తెలిపారు.

నేత్రపర్వంగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు.

సర్వవలసలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: అరకు నియోజకవర్గం ఇన్చార్జి మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని గుంటసీమ పంచాయతీ సర్వవలసలో మంగళవారం టీడీపీ నాయకులు ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం అవలం బిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన పరిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శెట్టి జగ్గయ్య, దన్నే రావు, రామచందర్, రఘురాం, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: 8వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ట్యాబ్‌లను వినియోగించుకోవాలని కేంద్రీకృత ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్‌లు అన్నారు. స్థానిక సీఏహెచ్ పాఠశాల వద్ద రామరాజు పడాల్, అదే క్రమంలో పెదబరడ ఆశ్రమ పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయుడు బాలన్నలు విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆశ్రమ పాఠ శాలల వసతి గృహ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెడితే సహించం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: రాష్ట్రంలో ఉన్న ఏకైక పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెడితే సహించేది లేదని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. భీమవరంలో జరిగిన సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లోవ ఆయన మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగంతో 64 గ్రామాల ప్రజల త్యాగంతో 20వేల ఎకరాల్లో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మకానికి పెడితే సహించేది లేదన్నారు. దేశ యువత భవిష్యత్తు కోసం స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోడానికి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుంచి గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షులు ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలలో మందుల నిల్వలు ఉంచాలి

విశాలాంధ్ర - హుకుంపేట: రైతు భరోసా కేంద్రాలలో మందులు నిల్వలు ఉండేటట్టు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యానిమల్స్ హస్బెండ్రీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండలంలో మఠం, గూడ, హుకుంపేట, సన్యాసమ్మ పాలెంలోని రైతు భరోసా కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పశువుల మరణాలు, పశువులకు ఎటువంటి టీకాలు వేశారు అని అడిగి తెలుసుకున్నారు. కాలానికనుగుణంగా పశువులకు వ్యాధులు వస్తుంటాయి కాబట్టి రైతులు ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మరణాలు అరికట్టవచ్చునని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని కురపల్లి గ్రామంలో ఇటీవల తీవ్ర అనా రోగ్యంతో మరణించిన పంది ఎరుకు రెడ్డి కుటుంబ సభ్యులకు వైయస్సార్ భీమాలో భాగంగా తక్షణ నిధి 10 వేల రూపాయలు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో పాండ్రంగి పీఏసీఎస్ చైర్మన్ ఆముజూరి అప్పారావు, ఇన్చార్జి ఎంపీటీసీ పిన్నింటి రమణ, పల్లి మహేష్, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజప్ప, వలంటీర్లు సన్యాసప్పుడు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మాక వరపాలెం ఎంపిపి రుత్తల సత్యనారాయణను మంగళవారం మాకవర పాలెం పిహెచ్‌సి వైద్యాధికారి ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సభలు, ర్యాలీలపై నిషేధం అప్రజాస్వామికం

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ: భద్రత పేరుతో, ప్రమాదాలు జరుగుతున్నాయన్న నెపంతో ఆంధ్రప్రదేశ్‌లో 30 పోలీ సు యాక్టు పెట్టి బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధి ంచడం ప్రజాస్వామ్యానికి పాతరేయడమేనని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఇంట్లో ఎలుక దూరిందని ఇంటిని తగలబెట్టినట్లు ప్రమాదాలు సాకు చూపించి ప్రతిపక్షం పార్టీలను నిరసనలు చేపట్ట కూడదని రాష్ట్ర ప్రభుత్వం పన్నిన పన్నాగంగా దీన్ని అభివర్ణించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ జిల్లాకు వెళ్లినా రోడ్లకు ఇరువైపులా పరదాలు కట్టి ప్రజలను రోజు వారి కార్యకలాపాలు నిర్వహించుకోకుండా ఇబ్బం దులు సృష్టించవచ్చా? అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజా స్వామ్యం? ఇది కేవలం ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కడానికేనని, అధికార పార్టీ మాత్రం ప్రద ర్శనలు, సభలు, సమావేశాలు ఎటువంటి అనుమ తులు తీసుకోకపోయినా పరవాలేదని విమర్శించారు.

రామన్నపాలెం బ్రిడ్జి ప్రారంభించిన మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర - కశింకోట: గుడివాడ అమర్నాథ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రామన్నపాలెం గ్రామానికి బ్రిడ్జి నిర్మిస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకుని మంత్రి అమర్నాథ్ మంగళవారం బ్రిడ్జిని ప్రారంభించారు. సంవత్సర కాలంలోనే 2 కోట్ల 14 లక్షల రూపాయలతో ఆ నిర్మాణాన్ని పూర్తి చేసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమర్నాథ్ నిలబెట్టుకున్నారు. రామన్నపాలెంలో రామాలయం లేకపోవడం చాలా దురదృష్టకరమని, నగంలో నిలిచిపోయిన రామాలయ నిర్మాణాన్ని తానే త్వరగా పూర్తి చేస్తానని అమర్నాథ్ హామీ ఇచ్చారు. అనకాపల్లి ఎంపీ బీశెట్టి సత్యవతమ్మ మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న అమర్నాథ్‌కు ప్రజల అండదండలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, విస్సన్నపేట సర్పంచ్ ఉప్పనూరు మాణిక్యం- అప్పారావు, ఎంపీటీసీ గూడుపు లక్ష్మి, నడిశెట్టి జోగినాయుడు, పోతల రామారావు, కుండల చంటి, విస్సన్నపేట ఉప సర్పంచ్ కుండల చిలుకుబాబు, మలసాల కిషోర్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, కుండ్ల చంటి, పల్లా లోవరాజు, ఆవాల కృష్ణ కన్నయ్య పాల్గొన్నారు.

పందులు స్వైర విహారం

విశాలాంధ్ర-యలమంచిలి: పగలు, రాత్రి తేడా లేకుండా పందుల సంచారం పెరిగిపోయింది. పట్టణంలో పందులను నివారించేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నా అవి విఫలమవుతూనే ఉన్నాయి. పందుల కారణంగా అపరిశుభ్రత పెరిగిపోయింది. అధికారులు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నా పందులు విషయంలో మాత్రం విఫలమవుతూనే ఉన్నారు. గతంలో పందులను పట్టుకుని వేరే ప్రదేశాలకు తరలించినా పందుల పెంపకందారుల్లో మార్పు రావడం లేదు. దీంతో పట్టణంలోని గాంధీనగర్, కొత్తపేట, జలాల్ వీధి, ధర్మవరం, ఓరుగంటి వారి వీధి తదితర ప్రాంతాల్లో పందుల కారణంగా అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. మున్సిపల్ అధికార్లు ఇప్పటి నుంచే పందుల విషయంలో చర్యలు తీసుకోకపోతే రోగాలు ప్రబలే ప్రమాదముందని ప్రజలు వాపోతున్నారు.

మరోవక్క పందుల పెంపకందార్లతో మున్సిపల్ అధికార్లు చర్చించి పట్టణ శివారు ప్రాంతాల్లో పందులను పెంచుకునేలా పట్టణంలో సంచరించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు, పవన్, లోకేష్ సభలకేనా ఈ జీవో

టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర - అనకాపల్లి: భారతదేశంలో ఏ రాష్ట్రంలోని ఏ ముఖ్యమంత్రి విధించని నిషేధాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నియంతృత్వ పోకడలకు ఫాసిస్ట్ పాలనకు నిదర్శనమని ప్రజాస్వామ్యం ఇసుమంతమైన ఉంటుందనుకున్న రాజకీయ పార్టీలకు జగన్ రెడ్డి జీవోతో భ్రమలు తొలగిపోయాయని అనకా పల్లి జిల్లా టీడీపీ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రోడ్లపై సభలో ర్యాలీలపై ఏపీ ప్రభుత్వం నిషేధం చంద్రబాబు నాయుడు బహిరంగ సభలకు వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక వైసిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తండోపతండాలుగా ఉత్సాహభరితంగా రోడ్ షోలకు, సభలకు, సమావేశాలకు విచ్చేస్తు న్నారని అన్నారు. అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రభు త్వం పోలీసు యంత్రాంగాన్ని నియమించకుండా నామ మాత్రం పోలీసుల్ని నియమించి వారిని ప్రేక్షక పాత్ర వహించే విధంగా ఉండాలని నిర్దిష్టమైన పోలీస్ అధికారులు ఆదేశాలను ప్రజానీకం గమనిస్తున్నారని అన్నారు. గతంలో అనేక సంఘటన వైసీపీ ప్రభుత్వంలో జరిగాయని 173 మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు ఈ జీవోని ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు మాట్లా డుతూ టీడీపీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి చేసిన పాదయాత్రకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగాన్ని నియమించి పాదయాత్రకు ఆటంకం కలగకుండా చేశారని మీలాగే జీవో ఇచ్చి ఉంటే మీ పాదయాత్ర జరిగేదా అని ప్రశ్నించారు.

ర్యాలీలు, సభలు పెట్టుకునే హక్కును హరిస్తున్న జగన్ సర్కారు

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం జగన్ సర్కార్ కాలరాస్తుందని, భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును హరించేలా ర్యాలీలు సభలు రోడ్లపై నిర్వహించరాదని చెప్పడం అన్యాయమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్ మండిపడ్డారు. మంగళవారం విశాఖ జిల్లా పార్టీ కార్యాలయం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పుల రాష్ట్రాన్ని గట్టెంక్కిం చాలంటే మళ్లీ చంద్ర బాబే రావాలన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనల్లో మాకు అనుమానాలు వున్నాయని, రెండు సంఘటనల్లో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఎప్పుడూ జరగని సంఘటనలు ఇప్పుడు ఎందుకు జరుగుతున్నాయని, రెండు సంఘటనల్లోనూ కుట్ర జరిగిందనే అనుమానాలు వున్నాయన్నారు. మృతుల కుటుంబాల పట్ల ప్రభుత్వానికి కనీస సానుభూతి లేదన్నారు. రాజమండ్రి సభలో జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే జనం జారుకుంటున్నారన్నారు. వృద్ధులకు 3 వేలు ఇస్తానని చెప్పి లబ్ధిదారులను తొలగించుకుంటూ పోతారా అని ప్రశ్నించారు.

గంగమ్మ తల్లి జాతర ఉత్సవాలు

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి ఎగువపేట వాడబలిజ కులమునకు చెందిన మత్స్య కారులు మంగళవారం గంగమ్మ తల్లి జాతర మహోత్సవం నిర్వహించారు. ఎటువంటి విపత్తులు జరగకుండా వేటకు వెళ్లే తమను ఆ గంగమ్మ తల్లి చల్లగా కాపాడాలని ఎగువపేట మత్స్యకార నాయకులు, మత్స్యకార మహిళలు పోలమాంబ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఎగువ పేట చదును పట్టు నుండి ఊరేగింపుగా బయలుదేరి భీమిలి పాత బస్టాండు చేరుకొని అక్కడి నుండి శ్రీ నూకాలమ్మ గుడి వద్దకు చేరి దర్శనం చేసుకున్నారు. అనంతరం పోలమాంబ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. సముద్ర తీరానికి చేరుకొని గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి ముత్తంశెట్టి మహేష్, గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షులు గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసి ంగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వాసుపల్లి ఎల్లాజీరావు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, గ్రామ పెద్దలు వాసుపల్లి గరగయ్య, గంట ఎల్లయ్య, పుక్కళ్ళ ఎల్లారావు, వాసుపల్లి చిట్టి, అల్లిపిల్లి గురువులు, నాయకులు పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైస్ ఎంపీపీ కోరాడ లక్ష్మణ్, పద్మశాలీల డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణ, ఎగువపేట మత్స్యకార సొసైటీ అధ్యక్షులు పుక్కళ్ల అమ్మోరు, కార్యదర్శి పీరుపల్లి రమేష్, కారి చిన్నారావు, పైడిపల్లి నర్సింగరావు, వాసుపల్లి అనిల్, అల్లిపిల్లి అశోక్, వాసుపల్లి మూర్తి, వాసుపల్లి మహేష్, వాసుపల్లి వీరబాబు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి కలెక్టర్

విశాలాంధ్ర - రంప చోడవరం: ఏజెన్సీలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషి యన్ కాన్సెప్ట్ క్యాంపులలో రోగులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రంప చోడవరం మండలం బందపల్లి. ఊట్ల గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని వైద్య పరీక్షలు నిర్వహించి సంబంధిత వ్యాధులకు మందులు అందజేయాలని ఆయన అన్నారు. మందపల్లి, ఊట్ల గ్రామపంచాయతీ సచివాలయాల బిల్డింగులు సబ్ కాంట్రాక్టు తీసుకొని పూర్తి చేయని వారికి నోటీసులు ఇవ్వాలని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

విశాలాంధ్ర - యస్.రాయవరం: సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం మండలంలో రేవు పోలవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వైసీపీ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అద్దేపల్లి నూకినాయుడు, అల్లాడ నాగరాజు, మత్స్యకార సహకార సంఘం చైర్మన్ మాతా గురునాథరావు, చోడిపల్లి గోవిందు, రమణ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - ఆనందపురం: బీజేపీ పార్టీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు జీ.వి.ఎల్. నరసింహారావు, జేఎల్ న్యూస్ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర రెడ్డి, బిజెపి కిసాన్ మోర్చా ఉత్తరాంధ్ర జోన్ సోషల్ మీడియా కన్వీనర్ వి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, బిజెపి నాయకులు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఉప్పాడ అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వర్మ, జే.ఎల్.టి.వి. విశాఖపట్నం జిల్లా ఇంఛార్జి పొట్నూరు గణేష్, బిజెపి నాయకులు వసంత వర్మ, అక్కయ్యపాలెం కళింగ వైశ్య సేవా సంఘం ఉపాధ్యక్షులు పొట్నూరు వెంకట కృష్ణారావు, పి. సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధరణ చూడలేకనే ర్యాలీలపై నిషేధం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: గుంటూరులో ఘటన అనంతరం మంత్రులు స్పందించిన తీరు చూస్తే వైసీపీ ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు పాల్పడినట్లుగా భావిస్తున్నా నని.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లా డుతూ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించడంలో విఫలమవుతున్న వైసిపి ప్రభుత్వం కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. గుంటూరులో తొక్కిసలాట విషయమై ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ స్పందించనంత వేగంగా మంత్రులు స్పందించారన్నారు. ఘటన జరిగిన వెంటనే చంద్రబాబు నాయుడు సభలకు అనుమతి ఇవ్వకూడదు అంటూ మంత్రులు స్టేట్మెంట్లు ఇచ్చారన్నారు. ఏదేమైనా వాస్తవాలు ప్రజల ముందుకు రావాలంటే గుంటూరు ఘటనపై తక్షణమే సిబిఐ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని రామ్ డిమాండ్ చేశారు. ర్యాలీలను అడ్డుకునే హక్కు ప్రభుత్వానికి లేదని.. న్యాయస్థానాల జోక్యంతో మళ్ళీ ర్యాలీలు కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేసారు.

రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యురాలు మృతి

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: మండలంలోని కుమారపురం శివారు రత్నయ్యపేట గ్రామానికి చెందిన పంచాయతీ 8 వ వార్డు సభ్యురాలు ఎరిపిల్లి బాగిర్తమ్మ (64) తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. భాగిర్తమ్మ నక్కపల్లిలో చేపలు కొనుగోలు చేసుకుని బొద్దవరం లో అమ్ముకుంటుండగా అక్కడ జీడిపిక్కల ఫ్యాక్టరీ చెందిన బస్సు రివర్స్ చేస్తుండగా వెనుక ఉన్న భాగిర్తమ్మ ను ఢీ కొట్టింది. తీవ్రగాయాలపాలై భాగిర్తమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కోటనందూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ ఫ్లోర్‌లో నిర్మాణాలు కూల్చివేత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ జోన్ 2 టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం శంకరమఠం రోడ్‌లో వార్డ్ నెంబర్ 25లో అనధికారికంగా స్టిల్ ఫ్లోర్లో కట్టిన బ్రిక్ వాల్స్‌ను తొలగించడం జరిగిందని జోన్ 3 ఏసిపి కె వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పదని ఆయన హెచ్చరించారు. సిల్ట్, పార్కింగ్ ఫ్లోర్ లో ఎలాంటి నిర్మాణాలు ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు ఈ తొలగింపు కార్యక్రమంలో టిపిఎస్ లు తేజ, ప్రమీలరాణి పాల్గొన్నారు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

విశాలాంధ్ర - కోటవురట్ల: రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమంతో కూడిన అభివృద్ధిని అందించడమే జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతనంగా మంజూరైన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. మరి కొంతమంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు చింతలపూడి వెంకటరామయ్య, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ దత్తుడుసీతబాబు, జెడ్పీటీసీ ఉమాదేవి, తహశీల్దార్ జానకమ్మ, సోమశేఖర్, కోటవురట్ల పంచాయతీ సర్పంచ్ బోడపాటి అనిల్ కుమార్, సెక్రటరీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కరకవానిపాలెంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర-పెందుర్తి: మండలంలోని కరకవానిపాలెం గ్రామంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. మండల టీడీపీ అధ్యక్షులు కరక దేముడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, కరెంటు బిల్లు, గ్యాస్ ధరలు గురించి వివరించి ప్రజల స్పందనను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జి కోరుబిల్లి సుందర్ రావు, గ్రామ కమిటీ సభ్యులు కొరుపోలు భాస్కరరావు, రొంగలి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ఇదేం ఖర్మ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: వృద్ధులకు, వికలాంగులకు, వితంతు వులకు ఆధారమైన పెన్షన్లను అనేక కారణాలు చూపి నిలిపివేయడం అన్యాయమని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి అన్నరు. టీడీపీ ఆధ్వర్యంలో అయ్యన్నపాలెం నుండి పెద గంట్యాడలోని వివిధ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. వెంటనే పెన్షన్లను పునరుద్ధ రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు పెద్దాడ సోము నాయుడు, నామాల పెంటయ్య, అండి బోయిన రాము నాయుడు, మొల్లి రమణ బాబు, ఈశ్వర రావు, ఉరుకటి అప్పారావు, ఉరుకటి వెంకట రావు, రాజు, రమణ, అప్పారావు, పాము తాతారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే పేదలకు న్యాయం

విశాలాంధ్ర - హుకుంపేట: సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన ఉన్నంత కాలం పేదప్రజలు, అవ్వతాతలు, వికాలాంగులకు మేలు కలుగుతుందని, జగనన్న పాలనలోనే వారు బ్రతుకులు బాగుంటుందని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మట్టుజోరు పంచాయితీ కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ నేపథ్యంలో నూతనంగా పించను మంజురైన లబ్ధిదారులకు పించను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో జరగని గొప్పపాలన మన రాష్ట్రంలో జరుగుతుందని అన్నారు. అనంతరం మొట్టు జోరు పంచాయతీ గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో మంజురైన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు పూర్తి చేసి చూపించినదుకు స్థానిక సర్పంచ్ సీదరి సాంభను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనసూయ, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌హెచ్‌పీ సమర్పించిన జాగెల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: వైవిధ్యమైన విలువ ప్రతిపాదన వైవిధ్యమైన వినియోగదారులతో వినియోగ నిర్వహణ పరంగా అగ్రగామి సంస్థగా వెలుగొందుతున్న జాగెల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ తమ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ)ని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వద్ద సమర్పించింది. భారతదేశంలో అత్యధికంగా ప్రీపెయిడ్ కార్డులను జారీ చేసిన సంస్థలలో ఒకటిగా నిలిచింది. మార్చి 31, 2022 నాటికి మొత్తం ప్రీపెయిడ్ లావాదేవీలలో 12.7 వాటాను సంస్థ కలిగి ఉంది. జాగెల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్ తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా ఒక రూపాయి ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేర్లను జారీ చేయడానికి ప్రణాళిక చేసింది. ఈ ఆఫర్‌లో భాగంగా 4900 మిలియన్ రూపాయల విలువ కలిగన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనున్నారు.

మహా ధర్నా విజయవంతం చేయండి

ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ

విశాలాంధ్ర - పాడేరు: ఈనెల 4న పాడేరు ఐటిడిఎ వద్ద విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గిరిజన విద్యార్థుల మరణాలపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, ఆశ్రమ పాఠశాలాల్లో హెల్త్ అసిస్టెంట్స్ నియమించాలని మహాధర్నాకు పిలుపునిచ్చామని తెలిపారు.

పీవీ చలపతిరావు అంతిమ యాత్రకు వచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

విశాలాంధ్ర - గాజువాక : బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి, తన తండ్రి స్వర్గీయ పీవీ చలపతిరావు అంతిమ యాత్రకు వచ్చి, ధైర్యం చెప్పిన రాజకీయ పార్టీల నాయకులకు, వివిధ సంస్థల అధినేతలకు ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ ఒక ప్రకటనలో ధన్యవా దాలు తెలియజేసారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తంపున తమ తండ్రి సేవలను గుర్తించి ప్రభుత్వ అధికార లాంఛ నాలతో అంత్యక్రియలు నిర్వహించడానికి అనుమతులు జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గెడ్డపై అక్రమ నిర్మాణం తగదు

విశాలాంధ్ర - పద్మనాభం: పాండ్రంగి పంచాయతీలో కుర పెల్లి గ్రామం నుండి బర్లపేట గ్రామానికి వెళ్లే త్రోవలో సొసైటీ క్వారీకి ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 76లో మాజీ సర్పంచ్ తన సొంత భూమిలో రిసార్ట్స్ కడుతున్నారు. అతను రిసార్ట్ నిర్మిస్తున్న పక్కనే ప్రభుత్వ స్థలంతో పాటు భారీ గడ్డ వాగు ఉంది. ఈ గడ్డపై అక్రమంగా భారీ వెడల్పులో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఈ గడ్డ వాగుకు పైన మెరక ప్రాంతం సుమారు వందలాది ఎకరాల నుండి వర్షాలు పడినప్పుడు తీవ్రస్థాయిలో నీరు గడ్డలోకి చేరుకుని ఉప్పెనలా పొంగి ప్రవహిస్తుంది. ఈ గడ్డపై అక్రమ నిర్మాణం చేపడుతుండడం వల్ల వరద నీరు దిశ మార్చుకొని ప్రాణ నష్టం కలిగించే ప్రమాదం ఉంది. దానివలన చుట్టుపక్కల రైతులు వరదల సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. చుట్టుపక్కల భూములకి అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల తహశీల్దార్‌కు పంచాయతీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

రైలు దిగుతూ జారిపడ్డ వ్యక్తి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: గర్భవతిగా ఉన్న కూతురిని చూడటానికి వస్తున్న తండ్రి కర్రి సురేష్ రైలు దిగుతూ జారిపడి కాళ్లు పోగొట్టుకున్న సంఘటన దువ్వాడ రైల్వేస్టేషన్లో మంగళవారం చోటుచేసుకుంది. తణుకుకు చెందిన సురేష్ విశాఖపట్నంలోని శ్రీహరిపురంలో నివాసముంటున్న కుమార్తె ఇంటికి వెళ్లేందుకు ఉదయం బయలు దేరారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాటుఫాంలో రైలు ఆగుతున్న క్రమంలో దిగుతుండగా కాలు జారి ప్లాటుఫాం, రైలు బోగీల మధ్య నుంచి రైలు పట్టాల్లోకి పడిపోయాడు. గమనించిన జీఆర్పీ పోలీసులు ఎస్ఐ శాంతిరామ్ రైలుపట్టాలపై పడి ఉన్న సురేష్‌ను సిబ్బంది సహకారంతో బయటకు తీసి సపర్యలు చేశారు. తీవ్రంగా గాయపడిన సురేష్‌న్ను 108 వాహనంలో కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్ర వద్ద ధ్యానం కోనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో ఆ కేంద్రంను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వ్యవసాయ అధికారి సౌజన్య పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పలు గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశారు. తిమ్మాపురం గ్రామంలో జెడ్పీటీసీ కాకర దేవి, ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచులు, ఎంపిటిసిలు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - ఎటపాక: అల్లూరి జిల్లా ఎటపాక మండలం గన్నేరుకొయ్యపాడు గ్రామంలో గ్రామస్తులు మంగళవారం ఓవర్ హెడ్ టాంక్ వద్ద శ్రమదానంతో మురుగుకాలువ తవ్వి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో దొంతు మంగేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం గూంజ్ సంస్థ కోఆర్డినేటర్ వెంకటేష్ గ్రామస్తులను అభినందించి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్ర మంలో తెలుగు రైతు రంపచోడవరం ఇంఛార్జి కానురి బల్లబ్బాయి, సర్పంచ్ ఉలవల శివకనకరాజు, బొమ్మగాని శ్రీను, రఘు, మనోహరం గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: మండలంలోని పాత్రికేయులుగా పనిచేస్తున్న మజ్జి వివిఎస్ చక్రధర్ కుమార్తె మజ్జి స్వప్నిక 6వ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మండలంలోని తూటంగి పంచాయతీ జర్రాయి గ్రామ పాఠ శాలలో విద్య నభ్యసిస్తున్న సుమారు 32 మంది విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు పవన్ కుమా ర్, పాత్రికేయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు చంపావతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర - ఆనందపురం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహణ పనుల నిమిత్తం ఆనందపురం మండలంలో బీపీ కల్లాలు, మచ్చ వాని పాలెం, పదాల వారి కల్లాలు, పల్లి పేట గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈ సురేష్ కుమార్ అన్నారు. పంచాయతీల గ్రామాలకు ఉదయం 09. 00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు సీలేరులో గ్రామసభ

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం సీలేరు గ్రామ పంచాయతీలో ఈ నెల 4న గ్రామసభ నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ సభకు అన్ని శాఖల ఉద్యోగులు, స్థానిక ఎంపీటీసీ గ్రామ పంచాయతీ పాలకవర్గము సచివాలయ ఉద్యోగులు ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

4న సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం

విశాలాంధ్ర - నాతవరం: ఈ నెల 4న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు నాతవరం మండల వైసిపి అధ్యక్షులు పైల పోతురాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశంకు సచివాలయ కన్వీనర్లు, వార్డు వాలంటీర్లు, జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రెసిడెంట్లు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్, నాయకులు, మహిళా విభాగం, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు.

కూనవరం ఆసుపత్రిని పీఓ తనిఖీ

విశాలాంధ్ర - కూనవరం: కూనవరం ప్రభుత్వ ఆసుపత్రిని చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లను పరిశీలించారు. ఆసుపత్రికి జనరల్ సర్జన్ పోస్ట్ భర్తీ చేయడం జరిగిందని వెంటనే ఇక్కడ ఆపరేషన్‌లు చేసే విధంగా చూడా లన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు బయట లాబ్‌లకు వెళ్ళకుండా ఆసుపత్రిలోనే అన్ని రకాల పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రి కూనవరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్లు డా. ఎంవీ కోటిరెడ్డి, డా. ఎస్.వినీత, జనరల్ సర్జన్ డా. జె.భాస్కర్, పిల్లల వైద్యులు డా. వంశీకృష్ణ, వైద్యాధి కారులు డా. పి.భబిత, డా హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం పాలెం ఉస్మానియా మసీద్ కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర - పియం పాలెం: జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు పీఎం పాలెం ముస్లిం కాలనీ సమీపంలో ఉన్న ఉస్మానియా ఈ మసీద్ లో కరోనా కారణంగా మూడేళ్లపాటు నిలిచిపోయిన కార్యవర్గంను ఏపీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షబ్నమ్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు అధ్యక్షుడిగా ఎంకెఎం చిస్టి, కార్యదర్శిగా షేక్ అక్తర్, కోశాధికారిగా షేక్ షరీఫ్, సహాయ కార్యదర్శి యూసఫ్ మాలిక్, ఉపాధ్యక్షులు షేక్ అల్లా ఉద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ షరీఫ్, ఈ ఎన్ ఎస్ చంద్రావు, అడ్వొకేట్ సలీం, కరీమ్ ఖాన్, ముస్లిం మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టండి

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

విశాలాంధ్ర - పీఎం పాలేం: ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జోన్-2 పరిధిలోని రెండవ జోన్ 8వ వార్డు పరిధిలో పలు ప్రాంతాలలో నిర్మిస్తున్న కొన్ని బిల్డింగ్‌లను పట్టణ ప్రణాళికాధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, ప్లానుకు విరుద్ధంగా నిర్మిస్తున్న బిల్డింగులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్లానులు మంజూరు చేసేటప్పుడు స్థలానికి వెళ్లి ఆయా ప్రాంతాలను పరిశీలిం చిన తరువాత అన్ని సక్రమంగా ఉంటేనే ప్లాను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎంవివి గ్రీన్ షీల్డ్ అపార్ట్ మెంట్, పరదేశి పాలెం లోని అపార్ట్మెంట్లను ప్లాన్స్ ప్రకారం నిర్మిస్తున్నదీ లేనిదీ పరిశీలించారు. భీమిలి వల్లభా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ లే-అవుట్ ను పరిశీలించి రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ మొదలైనవి ప్లాన్ ప్రకారం ఉన్నవీ లేనివీ పరిశీలించారు. అలాగే వంద ప్లాట్లు దాటిన అపార్ట్మెంట్లకు చుట్టూ ఖాళీ స్థలం, ఎస్టిపి ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆక్యుపన్సీ సర్టిఫికెట్ కోసం ఆమోదంకు వచ్చిన ప్లాన్లు చాల జాగ్రత్తగా పరిశీలించి భవనాలు నిర్మాణం జరిగే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సి సి పి సురేష్, డిసిపి పద్మజ, ఎసిపి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

విశాలాంధ్ర - మాకవరపాలెం: రాజకీయాలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మంగళవారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన 348 పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మండలంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు అయిందని, ఈ కళాశాల నిర్మాణం వల్ల ఆధునిక వైద్య సేవలు ఈ ప్రాంత ప్రజలందరికి అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపిపి రుత్తల లక్ష్మీ, వైసిపి మండల అధ్యక్షులు రుత్తల వాసు, జెడ్పీటీసీ సత్యవేణి, నాయకులు భద్రాచలం, హరిబాబు, ఎంపిడిఒ అరుణశ్రీ, చామంతిపురం సర్పంచ్ గోవింద, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాదిగమల్లులో ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - సీలేరు: యుఎస్ఎఫ్ ఫర్ ఎయిర్‌టెల్ ప్రాజెక్ట్ కింద జికేవీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ మాదిగమల్లు గ్రామంలో ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణానికి వెళ్లిన జికేవీధి సిఐ అశోక్‌కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ, ఎయిర్‌టెల్ ఇండస్ టవర్ మేనేజర్ ఎస్‌జి.ప్రసాద్‌లకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. అల్లూరి సీతారామ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు చింతపల్లి ఏఎస్పీ సూచన మేరకు యుఎస్ఓఎఫ్ ప్రాజెక్టు కింద మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్నటువంటి గిరిజనులకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఇంటర్నెట్ సదుపా యాలను, ఫోన్ సౌకర్యాలను కలిగించాలనే ఉద్దేశంతో మాదిగ మల్లు గ్రామానికి పోలీసులు, ఎయిర్‌టెల్ ఇండస్ టవర్ నిర్మాణ యాజమాన్యం స్థానిక విఆర్ఓ మంగమ్మ సర్వేయర్ రింకులతో పాటు సందర్శించి టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. గ్రామానికి వచ్చినటు వంటి పోలీసులకు, ఎయిర్‌టెల్ యాజమా న్యాలకు గ్రామస్తులు వారి సాంప్రదాయ పద్ధతుల్లో పూల మాలలు వేసి, పూజలు చేసి అపూర్వకంగా స్వాగతించి శం కుస్థాపన పనులను పూజలను దగ్గర ఉండి చేయించారు.

టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలి

రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: టిడిపి గెలుపు కోసం కృషి చేయాలని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మండలంలో తిమ్మాపురం గ్రామంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఇదే ఖర్మ రాష్ట్రం కు అనే కార్యక్రమం ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వై. వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కె. వెంకటేష్, పెద్దిరెడ్డి చిట్టిబాబు, జానకి శ్రీను, టిడిపి నాయకులు ఎన్. వెంకటరాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులంటే అంత చులకనా?

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని ఇప్పూరు, ములకపల్లి, ధారపల్లి, జీడిగుప్ప పాఠశాలలను మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మి సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ నేటికి విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకొనే పరిస్థితిని ఈ పాలకులు తీసుకురావడం బాధాకరం అని అన్నారు. ములకపల్లి పాఠశాలలో వరదల వలన పాఠశాల మునిగిపోయినా నేటికి సున్నం కూడా వేయకుండా గోడలకు మట్టిపట్టి ఉన్న పాఠశాలలోనే కింద కూర్చోపెట్టి పాఠాలు చెప్పించటం ఎంత దారుణమని అన్నారు. పాఠశాలలో ఒకే ఒక టీచర్‌ను ఉంచడం వలన వారు సెలవు పెడితే సి.ఆర్.పి లు వెళ్లి 2 పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, చిన్నమట్టపల్లి ఎం.పి.టి.సి పూనెం ప్రదీప్ కుమార్, రైతు సంఘం నాయకులు సోయం చినబాబు, పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామూర్తి, వద్లాది రమేష్, కదల కొండారెడ్డి, ఖాదర్, నాళ్లా రపు ప్రకాష్‌రావు, కొమ్మల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12న రణస్థలంలో పవన్ కల్యాణ్ 'యువశక్తి'

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్రాన్ని వైసిపి కబంధహస్తాల నుండి కాపాడి, నిరుద్యోగ యువతకు దిశా నిర్దేశం చేయడానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈనెల 12న శ్రీకాకుళంలోని రణస్థలంలో యువశక్తి పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం నగరంలోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పరిపాలనా వైఫల్యంతో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటుందని, యువతను గంజాయికి బానిసలను చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని యువత పార్టీలక తీతంగా వైసీపీ చేస్తున్న దోపిడీని అడ్డుకోవడానికి ముందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ వెంట నిలబడి యువశక్తి సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనసేన యువశక్తి మీడియా కమిటీ సభ్యులు దూలం గోపి, నాగలక్ష్మి, గండి దుర్గాప్రసాద్, గురు ప్రసాద్, మిడతాన రవికుమార్, దాసరి జ్యోతి రెడ్డి పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి

విశాలాంధ్ర-దేవరాపల్లి: దేశంలో స్త్రీల విద్యకు మొట్టమొదటిసారిగా బాటలు వేసిన చదువుల తల్లి మహిళా విద్యా ప్రదాత సావిత్రిబాయి

పూలేనని దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. స్థానిక అంబేద్కర్ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పూలె చిత్రపటానికి ఎంపీపీ రాజేశ్వరితో పాటు పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ,వార్డు మెంబర్ కాటపల్లి సృజన,ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రామారావు పాల్గొన్నారు.

పెందుర్తి: మహిళలకు చదువు, ఆత్మగౌరవం, చైతన్యం, అభివృద్ధికోసం సావిత్రిబాయి పూలే

ఎనలేని కృషి చేసారని కైట్స్ కంప్యూటర్ విద్యాసంస్థల ఎండి గొర్లె రామునాయుడు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పెందుర్తి కైట్స్ స్కిల్స్ కంప్యూటర్ సంస్థలో సావిత్రిబాయి జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ సెల్ జిల్లా కన్వీనర్ నాదెళ్ల జ్యోతి, ఛాత్రోపాధ్యాయినులు ఉష, మేరీ, లితాస్మి, రోహిణిలను రామునాయుడు, హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కొనే శ్రీధర్, కైట్స్ సభ్యులు శుభాన్, పెన్నం రమేష్, మన్మధరావు, శిల్ప, పవిత్ర తదితరులు మాట్లాడారు.

హుకుంపేట: మండల కేంద్రంలో పౌర స్వచ్ఛంద సంస్థ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో

చదువుల తల్లి సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాలు స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి టి. కృష్ణారావు, సీఐటీయూ మండల కార్యదర్శి టి అప్పలకొండపడాల్,ప్రధాన ఉపాధ్యాయులు జే.లంబన్న,పి హెచ్ సి డాక్టర్ సమాన, ఏ ఎన్ ఎం లు, ఆశవర్కర్లు , విద్యార్థులు, పాల్గొన్నారు.

కె.కోటపాడు : మొట్టమొదటి భారతీయ మహిళ ఉపాధ్యాయరాలు సావిత్రి బాయ్ పూలే జన్మదిన వేడుకలు మంగళవారం ఎంఈఓ. కార్యాలయము నందు మండల విద్యాశాఖ అధికారి టి.మధుమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు అనుపోజు సీతామహాలక్ష్మి, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా కమిటీ సభ్యులు పలువురు విశ్వబ్రాహ్మణ సంఘాలు పాల్గొన్నారు.

మల్కాపురం : భారతదేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అయిన సావిత్రి

భాయి పూలే జయంతిని ప్రతి విద్యాసంస్థలోనూ నిర్వహించాలని, ఆమె జీవితం మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయం అని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి కుమారి ఎన్.నదియా, సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ అభినందించారు.

పెద్దదబ్బందలో గడప-గడపకూ

విశాలాంధ్ర - భీమిలి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ (దబ్బంది) పెద్దదబ్బందలో గడపగడపకూ తిరిగి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. దబ్బంద వి ఎం ఆర్ డి ఏ రెవెన్యూ భూములను అంతా గ్రీన్ జోన్ లో పెట్టడం వలన రైతులు చాలా ఇబ్బందులు పడుతూ మా అవసరం నిమిత్తం క్రయ విక్రయాలు చేసుకొన దానికి ఎలాంటి అవకాశం లేదు దీనిని గ్రీన్ జోన్ నుంచి తొలిగించాలని పలువురు విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బంక సత్యం, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మాజీ వైస్ ఎంపీపీ డోల దేవుడు, మామిడిలోవ వైసీపీ పంచాయతీ అధ్యక్షులు బలిరెడ్డి మహేష్, సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పలువురు జోన్ల కమిషనర్లకు బదిలీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ కమిషనర్ రాజబాబు పరిపాలనపై పట్టు బిగిస్తున్నారు. వార్డులో క్షేత్రస్థాయి పాలనకు కేంద్ర బిందువులుగా ఉన్న జోనల్ కమిషనర్ల ను బదిలీకి శ్రీకారం చుట్టి పాలనను గాడిలో పెట్టారు. జీవీఎంసీలో పలువురు జోనల్ కమిషనర్లకు బదిలీలు జరిగాయి. కొంత మందికి మాత్రం యధాతథంగానే అదే జోన్లలో జోనల్ కమిషనర్లుగా కొనసాగేలా జీవీఎంసీ కమిషనర్ పి. రాజబాబు ఉత్తర్వులు మంగళవారం రాత్రి వెల్లడించారు. జోన్ 1 భీమిలి జోనల్ కమిషనర్ యస్వీ రమణ జోన్ 7 అనకాపల్లికి బదిలీ చేస్తూ, అనకాపల్లి జూన్ 7 లో జోనల్ కమిషనర్ గా పనిచేస్తున్న కనకమహాలక్ష్మిని మధురవాడ జోన్ 2 జోనల్ కమిషనర్ గా , మధురవాడ జోన్ 2 జోనల్ కమిషనర్ గా పనిచేస్తున్న కె. రామును జోన్ 1 భీమిలి రమణ స్థానంలో జోనల్ కమిషనర్ గా నియమించారు. జోన్ 3 ఆసిల్ మెట్ట జోనల్ కమిషనర్ గా పనిచేస్తున్న విజయలక్ష్మిని యధాతథంగా మళ్ళీ జోనల్ కమిషనర్ గా అక్కడే కొనసాగించారు. ఈమె ఇటీవలే జోన్ 8 పెందుర్తి జోనల్ కమిషనర్ గా ఉంటూ జోన్ 3 కి జోనల్ కమిషనర్‌గా పలువురు రాజకీయ సిఫార్సులతో వచ్చారని విస్తృత ప్రచారం జరిగింది. ప్రస్తుత బదిలీల్లో విజయలక్ష్మిని యధాతథంగా అదే జోన్‌లో కొనసాగించడానికి తూర్పు నియోజకవర్గ నేత క్రియాశీలకంగా వ్యవహరించినట్లు విస్తృత ప్రచారం సాగింది. జోన్ 4 సూర్య బాగ్ జోనల్ కమిషనర్ చక్రవర్తిని పూర్తిగా జోనల్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి ప్రధాన కార్యాలయంలో యు సి డి విభాగంలో డిపిఓ గా నియమించారు. డిపిఓగా పనిచేస్తున్న పి శివప్రసాద్ ను జోన్ 4 జోనల్ కమిషనర్ గా, ఇక జోన్ 5 జ్ఞానాపురం జోనల్ కమిషనర్ ఆర్ జి వి కృష్ణారావు అదే జోన్ లో జోనల్ కమిషనర్ గా కొనసాగించారు. జోన్ 6 గాజువాక జోనల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న పి సింహాచలంను అక్కడే జోనల్ కమిషనర్‌గా కొనసాగించారు. జోన్ 8 పెందుర్తి జోనల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న మల్లయ్య నాయుడును అక్కడే జోనల్ కమిషనర్‌గా కొనసాగించారు.